# నిక్షేపంలాంటి..

*

ఏమేవ్ సూర్యం! సూర్యం! చూశావా? ఎంత పని జరిగిందో? నేననుకొంటూనే ఉన్నా- చివరకు మరచిపోతానేమోనని."

"ఏమిటే అంత కంగారుగా పరుగెత్తుకొచ్చావ్? ఏమైందేంటి?

"ఆ-ఏమీ లేదమ్మా! ఈమధ్య నాకూ మా వారికీ కొంచెం తగాదా వచ్చింది..."

"ఏంటే-తగాదా వచ్చిందా? ఏమైంది తరువాత?"

"క్షమించాలమ్మా! నీ కిదివరకు చెప్పలేకపోయాను."

"ఊరికే చంపక-త్వరగా చెప్పవే సరసూ! మా ఆయన వచ్చే వేళైంది."

"ఆ...ఒక రోజున మాటమీద మాటొచ్చి 'అన్నమాట తప్పకుండా నెరవేర్చుకొంటా' నన్నా. అంటే మావారు 'నీ మొఖంలే! నీవలా చేస్తే నీకో బెనారస్ చీర కొనిపెడ్తా' నన్నారు. అంటే నేనన్నానుగదా 'సరే లెండి యేమాత్రం కొనిపెడ్తారో చూద్దాం. మనదొడ్డిలో గోంగూర విత్తనాలు జల్లి, నీరుపోసి, మొలకలెత్తాక మొక్కల్ని చక్కగా పెంచి వాటి ఆకులు కోసి, చక్కగా వేపి, పచ్చడిజేసి, ఆ పచ్చడితోటే అన్నం తింటా' నన్నాను. దానికి మావారు 'అలా చేయలేకపోతే...?' అన్నారు. 'మీ యిష్టం' అన్నానప్పుడు భారంయావత్తు ఆయనమీదే పెట్టి.

సిగ్గేసుంది మావారు కొంటెగా 'భార్యా దణ్ణమ్ పృథక్ శయ్యా' అని ఊరుకొన్నారు. ఇద్దరమూ కాసేపు నవ్వుకొన్నాం" అని చెప్పింది సరస్వతి.

"అయితే అసలు సంగతేంటో చెప్పవేమే?"

"సరే పంతం నెగ్గించుకోవాలని యెట్లాగో సంపాదించి గోంగూర విత్తనాలు జల్లాను. మొల్చాయి. శ్రద్ధతో నీళ్లు పోశాను. చక్కగా పెరిగాయి."

"ఊఁ తర్వాత?"

"పండగొస్తోంది కదూ. మా అమ్మ వాళ్ళు పండక్కి నన్ను తీసికొనిరమ్మని రెండుసార్లు ఉత్తరాలేశారు."

"పండుగంటే గుర్తొచ్చింది, నీవు బుధవారం పుట్టింటికి వెళ్తానన్నావుగదుటే."

"అవును. అందుకే యివ్వాళే వెళ్లాలని పట్టుపట్టాను. నా పోరుపడలేక మావారు సరే రాత్రికి ప్రయాణమన్నారు. మొదట శనివారంఅన్నారు. కాని శనివారమే అయితే పంతానికేనా సరే వెళ్లేదాన్ని కాను. ఆయన ఒక్కరే వెళ్లాలిసిందే. అంతే నేను పట్టుపడ్తే పెంకిపట్టే. భల్లూకపట్టన్న మాట."

"సరేలే అసలు విషయం తేల్చవే."

"నేను వెళ్ళిపోతే ఆ గోంగూర మొక్కల్ని యే మేకలన్నా పాడుచేస్తాయేమోనని గోంగూర పచ్చడి యివ్వాళే తిని వెళ్లాలనుకొన్నా. పాపం లక్ష్మి కూడా కూర కోసింది. చక్కగా వేపి, అన్నీ వేసి పచ్చడి చేశా, పట్టరాని ఆనందంతో, నా పంతం నెగ్గేవేళ సమీపిస్తుందిగదా! అని మా అమ్మగారింటి దగ్గర్నుంచి తెచ్చాను చూశావూ, ఆ రాచ్చిప్పలో వేసి మూతపెట్టాను."

"అయితే పంతం నెగ్గించుకొన్నావన్నమాటే"

"చెబుతున్నాగా?

సాయంత్రం ఆయన వచ్చేప్పుడు నాకొక ఉంగరం తెచ్చారు. ఆ ఆనందంతో అవీ యివీ చెప్పుకొంటూ అంతా భోజనాలదగ్గర కూర్చున్నాము. కులాసా కబుర్లతో, బంగాళా దుంప కూరతో తిని యిట్టే లేచాము. నా గుండెలో రాయిపడింది. గోంగూర పచ్చడి మాట మరచిపోయాను. ఎంత పని జరిగిందో చూశావుటే? ఇంకెట్లా?"

"ఆసి నీమతి మండిపోను. ఏం పిల్లవే? అంత మరుపా? పదా! నేనుకూడా వస్తా మీ యింటికి ఊట్టిదైనా తిందువుగాని."

ఇద్దరూ కలసి సరస్వతి యింటికి వెళ్లారు.

"పచ్చడేదే? సరసూ!" అంది సూర్యం.

సరసు "తీసుకొస్తా"నని వెళ్లి యిల్లంతా వెదికింది రాచ్చిప్ప కనపడలా.

"మీ అత్తయ్య నడగవే" అని చెప్పింది సూర్యం.

---

ఇక్కుర్తి అంకన్నారావు




"ఏంటమ్మా పిలుస్తున్నావు, ఏం కావాలి?" అంది అత్తగారు.

"రాచ్చిప్ప కనపడిందా అత్తయ్యా?"

"ఎందుకమ్మా? అలా అడుగుతున్నావు"

"అందులో..."

"ఆ...ఆ...ఆ...యేముంది?"

"నేను నూరుకున్న పచ్చడుంది."

"అయ్యో! నా మతేమైతమ్మా? నా కళ్ళు చిట్లిపోను-నా కళ్ళు కనపడన్నా కనపళ్ళా."

"ఏమైందత్తయ్యా? ఏమైంది?" అని కంగారుతో అడిగింది.

"ఉట్టిదేగదా! కడుక్కొద్దామని తీసికెళ్ళి అందులో కడుగునీళ్ళు పోశానె. నాకళ్ళు మరీ కనపడ్డం లేదమ్మా! నిక్షేపంలాంటి పచ్చడి" అంది.

దాంతో సరస్వతి అధఃపాతాళానికి క్రుంగిపోయింది. ఆమె ననుసరించింది సూర్యకుమారి.

భోజనంలో కాకపోయినా ఉట్టిది తిందామన్నా ప్రాప్తిలేకపోయింది సరుసుకు. ఇంక మరి బెనారిస్ చీర యెలా వస్తుంది?

---

## రవీంద్రుని భావాలు

చెరుకుమూడి రాధాకృష్ణమూర్తి

నీ వెవరయిందీ నీకే తెలీదు. నీకు కనిపించేది నీ నీడ మాత్రమే.

నీ కాకలి లేని కారణంచేత నీ ఆహారాన్ని నిందించబోకు.

మనం ప్రపంచాన్ని సరిగ్గా అర్థంచేసుకోక అది మనలను మభ్యపెట్టుందని చెప్తాం.

చంద్రుడు తన వెలుతురునంతా ఆకాశంవైపు మళ్ళించి నల్లమచ్చలు మాత్రం తనదగ్గర ఉంచుకుంటాడు. నెమలికి అంత బరువైన తోక వుందని పిచ్చుక వాపోయింది.

పక్షి తను మేఘంగా మారిపోతే ఎంత బావుంటుంది అనుకొంటుంది; మేఘం తను పక్షిగా మారిపోతే ఎంత బావుంటుంది అనుకొంటుంది.

మనిషి చిరునవ్వు నవ్వినపుడు ప్రపంచం అతణ్ణి ప్రేమించింది. అతను నవ్వగనే ప్రపంచం భయపడింది. కంటిరెప్పలు కంటికెలా చెందుతాయో అలాగే పనికి విశ్రాంతి చెందుతుంది.